క్లుప్తంగా

మంజీరాకు తగ్గిన వరద



నీట మునిగి దెబ్బతిన్న పత్తి పంట

న్యాల్‌కల్(జహీరాబాద్): మంజీరా నదికి వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. ఫలితంగా మండలంలోని నదీ పరివాహక ప్రాంతాలైన హుస్సెన్ నగర్, చీకూర్తి, అమీరాబాద్, ముర్తుజాపూర్, చాల్కి, రాఘవాపూర్ పరిధిలోని పంటలు నీట మునిగాయి. చీకూర్తి వంతెన కూడా నీట మునగడంతో అధికారులు వంతెనపై రాకపోకలు నిలిపేశారు. రెండు రోజుల నుంచి వరద ఉధృతి తగ్గడంతో రాకపోకలను పునరుద్ధరించారు. నీట మునిగి దెబ్బతిన్న పంటలను చూసి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలతో పాటు పంట పొలాల వద్ద ఉన్న విద్యుత్ మోటార్లు, ఇతర పరికరాలు పాడై తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభాత్‌రెడ్డికి సత్కారం



ప్రభాత్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని పెద్దశంకరంపేట మండలం మూసాపేట్ గ్రామానికి చెందిన ఈరగారి ప్రభాత్‌రెడ్డి గ్రూప్–1 ఫలితాల్లో విజయం సాధించి డీఎస్పీగా నియామకమయ్యారు. శుక్రవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డిని కలవడంతో ప్రభాత్‌రెడ్డిని సన్మానించి, అభినందనలు తెలిపారు. పేదలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంపీ సురేశ్‌షెట్కార్ సైతం ప్రభాత్‌రెడ్డిని సన్మానించారు.

సదాశివపేట ఎస్‌ఐగా రవిగౌడ్



సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): సదాశివపేట ఎస్‌ఐగా రవిగౌడ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రవిగౌడ్ మాట్లాడుతూ... ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. అసాంఘిక కార్యక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. మట్కా, గుట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తేలేదన్నారు.

గోమాతకు అంత్యక్రియలు

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని చారిత్రక రామమందిరం గోమాత గురువారం మృతి చెందడంతో భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు భజరంగ్ దళ్ బాధ్యులు గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి గోతిలో పూడ్చారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సింధురెడ్డి తదితరులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నియోజకవర్గంలోని జీహెచ్‌ఎంసీ కార్మికులకు, కూలీలకు శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన నివాసంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి, ఆకాశం అనాథాశ్రమ ట్రస్ట్ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి సహకారంతో కార్యక్రమం చేపట్టామన్నారు. దసరా పండుగ సందర్భంగా నిరుపేదలకు తమ వంతు సాయం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సింధురెడ్డి, మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, అంజయ్య, కృష్ణ కాంత్, సుధాకర్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని మంకాల్ బాంకెట్ హాల్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంకాల్ సుభాష్ తెలిపారు. వైద్య శిబిరంలో ఉచితంగా గ్యాస్ట్రోఎంటరాలజీ, క్యాన్సర్ స్కానింగ్ టెస్టులతో వైద్య సలహాలు, మందులు పంపిణీ చేస్తామన్నారు. ఉ. 8 గంటల నుంచి వైద్య శిబిరం ప్రారంభమవుతుందని, చికిత్స చేసుకునేవారు 9963079143 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

బాల్య వివాహాలపై అవగాహన

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని చౌట్లపల్లి, బొగుడభూపతిపూర్, వాడి, బూర్గుపల్లి, మద్దుల్‌వాయి, తొగిటలలో విజన్ ఎన్జీఓ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహాలు చేయడంతో కలిగే నష్టాలను విజన్ ఎన్జీఓ కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్ నవనీత వివరించారు.

ఘనంగా విజయదశమి



నారాయణఖేడ్: శమీపూజలో పాల్గొన్న ఎంపీ సురేశ్ షెట్కార్ తదితరులు

జిల్లా వ్యాప్తంగా విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రావణ దహనం కార్యక్రమం అట్టహాసంగా జరిపారు. ఊరూరా భాజాభజంత్రీలతో ఊరేగింపుగా వెళ్లి జమ్మి చెట్టుకు పూజలు చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



రామచంద్రపురం: జమ్మిచెట్టు పూజలో పాల్గొన్న కార్పొరేటర్ సింధురెడ్డి



రాయికోడ్: జమ్మి చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు



న్యాల్‌కల్‌లో జమ్మి చెట్టుకు పూజలు చేస్తున్న బ్రాహ్మణులు



జిన్నారం: దుర్గమ్మ ఆలయం వద్ద..



సదాశివపేట: పాలపిట్టను ఎగురవేస్తున్న పట్టణ పురప్రముఖులు



సదాశివపేట: రాగి చెట్టు కొమ్మపై ప్రజలకు దర్శనిమిస్తున్న పాలపిట్ట



అమీన్‌పూర్ దసరా సంబరాల్లో పాల్గొన్న కాటా శ్రీనివాస్‌గౌడ్ తదితరులు



పటాన్‌చెరు: పాలపిట్టను వదులుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



జహీరాబాద్ టౌన్: శమీచెట్టుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, శివకుమార్



హత్నూరలో రావణ దహనం నిర్వహిస్తున్న ప్రజలు



జమ్మిచెట్టు పూజలో పాల్గొన్న నీలం మధు



ఝరాసంగం(జహీరాబాద్): వేడుకల్లో పాల్గొన్న నాయకులు

నీటి సమస్య ఉంటే.. కలెక్టర్‌తో చెప్పుకోండి

పంచాయతీ అధికారుల దురుసు సమాధానం



వాటర్ ట్యాంకర్ వద్ద గుమిగూడిన యువకులు, మహిళలు

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండల పరిధి ఖాజాపూర్ గ్రామంలో ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యపై అధికారులు స్పందించిన తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. తాగునీటి సమస్య ఉంటే కలెక్టర్‌తో చెప్పుకోండని అనడంపై మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను ఎంపీడీఓ, పంచాయతీ సెక్రటరీకి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మిషన్ భగీరథ మంచినీటి పథకం ద్వారా నీటి సరఫరా జరగడం లేదన్నారు. ఫలితంగా ఎవరికి వారు ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల సాయంతో ప్రైవేటు, వ్యవసాయ బోర్ల నుంచి నీరు తెచ్చుకొంటున్నారు. కాగా తమ సమస్య ఎవరికి విన్నవిస్తే పరిష్కారం అవుతుందోనంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

నర్సింహ్మారెడ్డిని పదవి నుంచి తప్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ నర్సింహ్మారెడ్డిని మండల అధ్యక్ష పదవి నుంచి తప్పించాలని నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ చంద్రశేఖర్ జిల్లా అధ్యక్షురాలు నిర్మలను కోరారు. శుక్రవారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశం రద్దు అయిందని నర్సింహ్మారెడ్డి సోషల్ మీడియాలో పోస్టు పెట్టారని, పార్టీ లైన్‌ను ఉల్లంఘిస్తూ పార్టీ శ్రేణులను అయోమయానికి గురిచేస్తున్నారని చంద్రశేఖర్ ఆరోపించారు. నర్సింహ్మారెడ్డి సమావేశానికి రాకపోగా పార్టీకి నష్టం కల్గించేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఏఐసీసీ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజ్ అధ్యక్షతన అందోల్‌లో జరిగిన జనహిత పాదయాత్ర కార్యక్రమానికి కూడా ఆయన హాజరు కాలేదన్నారు. అంతకు ముందు పట్టణంలో నిర్వహించిన పార్టీ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు కండెం నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి మక్సూద్ తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో అలయ్ బలయ్

నారాయణఖేడ్: దసరా వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం అన్ని పార్టీల నాయకులు అలయ్ బలయ్ నిర్వహించారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎంపీ సురేశ్ షెట్కార్‌ను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, విజయపాల్ రెడ్డి, పార్టీల నాయకులు, కార్యకర్తలు అలయ్ బలయ్‌కు తరలివచ్చారు. నియోజకవర్గంలోని కార్యకర్తలు సురేశ్‌షెట్కార్, సంజీవరెడ్డిలతో పాటు నగేశ్‌షెట్కార్, శ్రీనివాస్, రాకేశ్‌షెట్కార్, సాగర్‌షెట్కార్, చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో..

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించారు. దసరా పండుగను పురస్కరించుకుని నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యే మాణిక్‌రావుని కలిసి దసరా పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వారికి పండగ శుభాకాంక్షలు తెలిపి ఆలయ్ బలయ్ చేసుకున్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మాణిక్‌రావుకు శుభాకాంక్షలు శివకుమార్‌రెడ్డి తదితరులు

స్ఫూర్తి ప్రదాతకు నివాళి



సదాశివపేట: గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్, నాయకులు

జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రజాప్రతినిధులు, అధికారులు గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్య తెచ్చిన మహనీయుడని కొనియాడారు. యువత గాంధీ మార్గంలో నడవాలని సూచించారు.



జహీరాబాద్ టౌన్: మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



న్యాల్‌కల్: తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో..



నారాయణఖేడ్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి తదితరులు



జిన్నారం: గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు



శోభాయాత్ర నిర్వహిస్తున్న సేవకులు

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను ఉత్సాహంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇందూర్ ఆశ్రమ గురువు చెన్నమల్లికార్జున స్వామి, ఆర్‌ఎస్‌ఎస్ మెదక్ విభాగ్ ప్రచారక్ వి.భూమేశ్‌లు భరతమాత, దుర్గామాత, ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ కేశవ్‌రావు బలిరామ్ పంత్ హెడ్గెవార్, గురూజీ చిత్రపటాలకు పూజలు చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన స్వయం సేవకులు గ్రామంలో కవాతు నిర్వహించారు. ఆయా చిత్రపటాలను కారుపై ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ కరసేవకులు నిస్వార్థ సేవకులన్నారు. దేశం, ధర్మం కోసం ఎల్లప్పుడు ముందుంటారన్నారు. వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి దేశ, ధర్మ పరిరక్షణే ధ్యేయంగా పనిచేసే స్వయం సేవకులు ప్రపంచానికే ఆదర్శమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు దేశం, ధర్మం, ఆధ్యాత్మిక వారసత్వం తదితర అంశాలపై అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు.

నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) శతాబ్ది ఉత్సవాలను ఖేడ్‌లో గురువారం నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకులతో పాటు భరతమాత చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం సంఘ్ కృషిని సంఘ బాధ్యులు వివరించారు.

తడ్కల్ గ్రామంలో..

కంగ్టి(నారాయణఖేడ్): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆవిర్భావ శతాబ్ది ఉత్సవాలు మండలంలోని తడ్కల్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. సంఘ్ చాలక్ ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ ఆలయం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో వంద మంది కార్యకర్తలు ప్రత్యేక వేషాధారణలో దండ చేత పట్టుకొని విన్యాసాలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర సాధనలో ఎమ్మార్పీఎస్ కీలక పాత్ర



ఎమ్మార్పీఎస్ జెండాను ఎగుర వేస్తున్న నేతలు

న్యాల్‌కల్(జహీరాబాద్): రాష్ట్ర సాధనకు తెలంగాణతో పాటు ఆంధ్ర, రాయల సీమ ప్రాంతాల్లో ఉద్యమాలు చేపట్టిన ఘనత ఎమ్మార్పీఎస్‌కే దక్కుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాంచెందర్, ఎంఎస్‌పీ అధ్యక్షుడు అబ్రహం అన్నారు. మండల పరిధి న్యామతాబాద్ గ్రామంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు శరణప్ప, సంగమేశ్వర్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన చౌరస్తా వద్ద జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం 30 ఏళ్ల పాటు ఎమ్మార్పీఎస్ అలుపెరుగని పోరాటం చేసి విజయం సాధించిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఉల్లాస్ మాదిగ, నిర్మల్ కుమార్ మాదిగ, శాంత్‌కుమార్, నర్సింహారెడ్డి, గొల్ల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరిగితేనే స్పందిస్తారా?



అదుపు తప్పిన వాహనం

సంగారెడ్డి క్రైమ్: పట్టణంలోని ప్రధాన రోడ్లపై అడ్డంగా ఇసుక, కంకర కుప్పలు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ఐబీ నుంచి గుర్రంబొమ్మ వరకు నాలుగు నెలల క్రితం బైపాస్ విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. పనులు నత్తనడకన సాగుతున్నాయి. బైపాస్‌లోని మహిళా ప్రాంగణం నుంచి మార్కెట్ యార్డ్ వరకు కొంతదూరం కాంట్రాక్టర్ కంకర పోసి వదిలేశాడు. దీంతో పాదాచారులు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

నారాయణఖేడ్: పెద్దశంకరంపేట మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మురళి పంతులు, పట్టణానికి చెందిన పలువురు వార్డు సభ్యులు భారీ సంఖ్యలో వారి అనుచరులతో కలసి శుక్రవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురళి పంతులు ఆధ్వర్యంలో ఇంకా భారీ చేరికలు ఉంటాయన్నారు. మురళి పంతులు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ కోసం పదేళ్లు ఎంతో కష్టపడి పనిచేసినా గుర్తింపు లేకపోగా తనపై దుష్ప్రచారం చేయడం వల్ల కాంగ్రెస్‌లో చేరానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో దుర్గామాత నిమజ్జనం



తడ్కల్: దుర్గామాత విగ్రహాన్ని ఊరేగిస్తున్న దీక్షాధారులు



బాన్సువాడలో భజనలతో అమ్మవారి నిమజ్జనోత్సవం

కంగ్టి(నారాయణఖేడ్): దేవీ శరన్నవరాత్రులు పురస్కరించుకొని ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాలకు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనాలు చేశారు. పలు గ్రామాల్లో దుర్గామాత దీక్షాధారులు భజనలు చేస్తూ అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు.

అమ్మవారి చీర రూ.1.20 లక్షలు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): అమ్మవారి చీరను అందిస్తున్న సభ్యులు

రామచంద్రాపురం(పటాన్ చెరు): రామచంద్రాపురం పట్టణంలోని మల్లికార్జున నగర్‌కాలనీలో దుర్గాభవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద శుక్రవారం అమ్మవారి చీర, నోట్ల దండను వేలం వేశారు. చీరను పవన్‌కుమార్ రూ. లక్ష 20వేలు, నోట్ల దండను ఈశ్వర్ రూ.70 వేలకు సొంతం చేసుకున్నారు. వారిని నిర్వాహకులు సన్మానించారు.

జిన్నారం పట్టణ కేంద్రంలో..



జిన్నారం: శోభాయాత్రలో దుర్గాభవానీ

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం పట్టణ కేంద్రంలో నవరాత్రుల సందర్భంగా ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత తొమ్మిది రోజులు అనంతరం నిమజ్జన మహోత్సవం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి నిమజ్జన శోభాయాత్ర పట్టణ వీధుల గుండా డప్పుల దరువులు, డీజేల స్టెప్పులు, టపాసుల మోతలతో దద్దరిల్లింది. శోభాయాత్ర కొనసాగుతున్న వేళ మహిళలు మంగళహారతులతో అమ్మవారికి నీరాజనాలు పట్టారు. కోలాహలం నడుమ నిర్వాహకులు అమ్మవారిని అక్కమ్మచెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు, పట్టణ ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం

నారాయణఖేడ్: కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఖేడ్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ భవన్ ఆవరణలో సంఘ జెండాను సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కొతారి నర్సింహులు ఆవిష్కరించారు. 1998లో ఆవిర్భవించిన సంఘం దళితుల ఆత్మగౌరవం, సమానత్వం, కుల వివక్షత, అంటరాని తనం రూపుమాపడం, సమస్యల పరిష్కారానికి చేసిన కృషిని ఈ సందర్భంగా ఆయన వివరించారు. సంఘం డివిజన్, మండలాల బాధ్యులు పాల్గొన్నారు.